వేగుచుక్క

# తిరుమలలో 4న రథసప్తమికి భారీగా ఏర్పాట్లు

తిరుమల: రథసప్తమిని పురస్కరించుకుని రెండు లక్షల మంది వస్తారని అంచనా వేశామని టిటిడి ఛైరమన్ బిఆర్ నాయుడు అన్నారు. రథసప్తమి నాడు ఆర్జిత సేవలు, ప్రివిలేజ్ దర్శనాలు రద్దు చేశామన్నారు. టైం స్లాట్ టికెట్స్‌ను ఫిబ్రవరి 3 నుంచి 5 వరకు రద్దు చేశామని తెలిపారు. ప్రత్యేక ప్రవేశ దర్శనం కలిగిన భక్తులకు నిర్ణీత సమయంలో దర్శన భాగ్యం కల్పిస్తామని చెప్పారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన టీటీడీ పాలకమండలి శుక్రవారం సమావేశమైంది. రథసప్తమిని పురస్కరించు కుని ఏర్పట్లపై టీటీడీ పాలకమండలి సమావేశం నిర్వహించింది. రథసప్తమి ఏర్పాట్లపై సభ్యులు, అధికారులతో సమావేశంలో చర్చించారు. భక్తులకు కల్పించాల్సిన సదుపాయాలు, సౌకర్యాలపై అధికారులకు టీటీడీ చైర్మన్ పలు సూచనలు చేశారు. సమావేశం అనంతరం బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ.. ఫిబ్రవరి 4వ తేది జరగనున్న రథసప్తమి ఏర్పాట్లపై పాలకమండలి సమావేశం నిర్వహించి నట్లు తెలిపారు. సప్త వాహనాలపై శ్రీవారు తిరుమాడ వీధుల్లో ఊరేగి దర్శన భాగ్యం ఇస్తారని అన్నారు. రథసప్తమి నాడు ఉదయం 6:44 గంటలకు సూర్యోదయ గడియలు రానున్నాయని.. ఈ ఘడియల్లో స్వామి వారిని సూర్య కిరణాలు తాకుతాయని చెప్పారు. రథసప్తమి సందర్భంగా 1250 మంది పోలీసులు, 1000 మంది విజిలెన్స్ సిబ్బందితో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఘూర్కింగ్, అగ్నిప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్యాలరీలలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చక్రస్నాన సమయంలో పుష్కరిణిలో గజ ఈతగాళ్లను నియమించామని వెల్లడించారు. గ్యాలరీలలో వేచి ఉన్న భక్తులకు నిరంతరాయంగా అన్నపానీయాలు వితరణ చేస్తామన్నారు. ఆలయ మాడ విధుల్లో చలవపందిళ్లు ఏర్పాటు చేశామని.. 8 లక్షల లడ్డూలు భక్తుల సౌకర్యార్థం అందుబాటులో పెడుతామన్నారు. తిరుమలను విద్యుత్, పుష్పాలంకరణతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతామని టీటీడీ పాలకమండలి చైర్మన్ బీఆర్ నాయుడు పేర్కొన్నారు.

# నేను కొడితే మామూలుగా ఉండదు

**గజ్వేల్:** తాను కొడితే మామూలుగా ఉండదని.. గట్టిగా కొట్టడం తన అలవాటని బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ అన్నారు. ఈ మేరకు ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌లో బిఆర్ఎస్ నేతల సమావేశంలో
బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు కీలక వ్యాఖ్యలు చేశారు. జహీరాబాద్ బీఆర్ఎస్
నియోజకవర్గ నాయకులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజలు సంతోషంగా లేరన్నారు. గంభీరంగా, మౌనంగా ఈ ప్రభుత్వాన్ని చూస్తున్నానని అన్నారు. తాను ఎన్నో ప్రభుత్వాలను చూశానని.. ఇలాంటి ప్రభుత్వాన్ని మాత్రం చూడలేదన్నారు. ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని, కాంగ్రెస్ వాళ్లు కనబడితే జనాలు కొట్టేలా ఉన్నారన్నారు. తాను చెప్పినా ప్రజలు వినలేదని.. అత్యాశకు పోయి కాంగ్రెస్‌కు ఓటేశారన్నారు. రైతుబంధుకు రాం రాం.. దళితబంధుకు జై భీం చెబుతారని తాను ఎన్నికల సమయంలోనే చెప్పానని గుర్తు చేశారు. ఏ ప్రభుత్వం కావాలని కాంగ్రెస్ సోషల్ మీడియాలో ఓటింగ్ పెట్టారన్నారు. ఇప్పుడే మన ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వమే కావాలని ఓట్లు వేశారన్నారు. కాంగ్రెస్ పాలకులు రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారని ఆరోపించారు. గురుకులాల్లో చదువు అగమ్యగోచరమైందని.. పురుగుల అన్నం పెడుతున్నారని మండిపడ్డారు. తులం బంగారానికి ఆశపడి కాంగ్రెస్‌కు ఓటు వేశారన్నారు. రాబోయే



రోజుల్లో విజయం మనదేనన్నారు. మన విజయం తెలంగాణ ప్రజల విజయం కావాలన్నారు. ప్రత్యక్ష పోరాటాలకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పోరాటం చేస్తే తప్ప ఈ ప్రభుత్వం దిగిరాదన్నారు. ఫిబ్రవరి నెలాఖరులో భారీ సభ పెడుతామని.. బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో భూముల ధరలు అమాంతం పడిపోయాయని.. రాష్ట్రంలో ప్రాజెక్టులు అక్కడే ఆగిపోయాయని మండిపడ్డారు. సంగమేశ్వర, బసవేశ్వర, కాళేశ్వరం ప్రాజెక్టులను ఎండబెడుతున్నారంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని మబ్బులు ఇప్పుడే తొలగిపోయి నిజాలు బయటకు వస్తున్నాయన్నారు. మంచేదో చెడు ఏదో ప్రజలకు తెలుస్తుందన్నారు. మాట్లాడితే ఫామ్ హౌస్.. ఫామ్ హౌస్ అని బద్నాం చేస్తున్నారన్న కేసీఆర్.. ఫామ్ హౌస్‌లో పంటలు తప్ప ఏముంటాయని ప్రశ్నించారు. ఓట్ల కోసం కాంగ్రెస్ ముస్లింలను వాడుకుంటుందన్నారు. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల టెండర్లు ఎందుకు పిలువలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనపై అంతా అసంతృప్తే ఉందన్నారు. అన్ని వర్గాలను కాంగ్రెస్ ముంచిందన్నారు. పాలనా వైఫల్యాలను నిలదీస్తే కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ప్రాజెక్టులకు సంబంధించి ఎలాంటి పురోగతి లేదని దుయ్యబట్టారు. 'రాష్ట్రాన్ని కైలాసంలో పెద్దపాము మింగినట్లైంది. తెలంగాణకు ఇదో మంచి గుణపాఠం. కొందరు అత్యాశకు పోయి చెప్పుడు మాటలు విని మోసపోయారు. రైతు భరోసా ఇస్తారో.. లేదో. ఇచ్చినా కూడా మోసమే.. ఎన్నికల కోసమే ఇస్తారు. రాష్ట్ర ఆదాయం భారీగా పడిపోయింది. భారాస హయాంలో ఆదాయం ఏటా పెరిగితే ఇప్పుడు పడిపోయింది. రూ.13 వేల కోట్ల ఆదాయం పడిపోయిందని కాగ్ నివేదిక స్పష్టం చేసింది. పరిస్థితులు ఇంకా దారుణంగా తయారవుతాయి. మరో నాలుగు నెలల గడిస్తే జీతాలు ఇవ్వలేని పరిస్థితి వస్తుంది. భూముల ధరలు బాగా పడిపోయాయి, రియల్ ఎస్టేట్ రంగం దెబ్బతింది. గురుకులాల్లో పురుగుల అన్నం పెడుతున్నారని తల్లిదండ్రులు పిల్లల్ని తీసుకెళ్తున్నారు. మళ్లీ పాత కాంగ్రెస్ మోపైంది. విద్యుత్ కోతలు ఉన్నాయి, తాగునీరు సరిగా రావడం లేదు. సాగునీటి ప్రాజెక్టులను పండపెట్టారు. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాల కోసం పోరాడదాం. ఇప్పుడే కరెంటు కోతలు ఉంటే.. ఏప్రిల్, మే లో ఎలా ఉంటుందో? రాజ్యం అంటే ఇలానే ఉంటుందా? ఏడాది పూర్తయింది.. ఎండగట్టాలని మన వాళ్లు అంటున్నారు.
ఫిబ్రవరి నెలాఖరులో భారీ బహిరంగసభ పెట్టి ప్రభుత్వాన్ని ఎండగడదాం. నేను గంభీరంగా, మౌనంగా ఈ ప్రభుత్వాన్ని చూస్తున్నాను. కొడితే మామూలుగా కాదు.. గట్టిగా కొట్టడం నాకున్న అలవాటు. నేను ఎన్నో ప్రభుత్వాలను చూశాను కానీ, ఇలాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు. ఎడాదిలోనే ఇంత
వ్యతిరేకత కాంగ్రెస్ ప్రభుత్వంపై వచ్చింది. కాంగ్రెస్ వాళ్లు కనిపిస్తే జనాలు కొట్టేలా ఉన్నారు. ఏ ప్రభుత్వం కావాలని కాంగ్రెస్ సోషల్ మీడియాలో ఓటింగ్ పెడితే.. భారాస ప్రభుత్వం కావాలని ఓట్లు వేశారు. తెలంగాణ శక్తి ఏమిటో చూపించి కాంగ్రెస్ మెడలు వంచుదాం. ఫాం హౌస్... ఫాం హౌస్ అని అంటారు. ఇక్కడ అల్లం, ఉల్లిపాయ తప్ప ఏమున్నాయి? కాంగ్రెస్ వాళ్లు ఇక్కడకు వస్తే తలో పార ఇచ్చి తవ్వకోమందాం. కచ్చితంగా రాబోయేది మన ప్రభుత్వమే. అందులో అనుమానం ఏమీ లేదు' అని కేసీఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో హరీస్ రావు, ఎమ్మెల్యేలు సునీతా మహేందర్ రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దేశ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా బడ్జెట్

**న్యూఢిల్లీ:** పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టబోయే బడ్జెట్ దేశ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ఉంటుందని ప్రధాని మోడీ అన్నారు. పార్లమెంటు సమావేశాలు ప్రారంభం అయిన సందర్భంగా ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. ఈ సమావేశాలు ప్రారంభమయ్యే ముందు పార్లమెంటు వెలుపల ప్రధాని మోడీ మీడియాతో మాట్లాడారు. 'పార్లమెంటు సమావేశాలు సజావుగా సాగేందుకు ప్రతిపక్షాలు సహకరిస్తాయని నేను భావిస్తున్నాను. మూడోసారి ఎన్డీయేకు ప్రజలు పట్టం కట్టారు. పార్లమెంటులో సంపూర్ణ బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నాం. ఈ బడ్జెట్ ప్రజల్లో కొత్త విశ్వాసం నింపుతుందని ఆశిస్తున్నాను. ఈ బడ్జెట్ వికసిత్ భారత్‌కు ఊతం ఇస్తుంది. ఇన్నేవేషన్, ఇన్‌క్లూజన్, ఇన్వెస్ట్‌మెంట్ లక్ష్యంతో దూసుకెళ్తున్నట్లు' మోడీ చెప్పారు. కొత్త విధానాలైనే ఆర్థిక ప్రగతి ఆధారపడి ఉంటుంది. ఈ సమావేశాల్లో కీలక బిల్లులను ప్రవేశపెట్టనున్నట్లు మోడీ తెలిప్పారు. ఇప్పుడు జరిగే పార్లమెంటు సమావేశాల్లో అన్ని అంశాలపై సమగ్ర చర్చ జరిపేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని మోడీ విజ్ఞప్తి చేశారు. జనవరి 31 నుండి ఏప్రిల్ 4 వరకు రెండు విడతల్లో బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. మొదటి విడత సమావేశాలు ఫిబ్రవరి 13న ముగుస్తాయి. ఈ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం 16 బిల్లులను ప్రవేశపెట్టాలని చూస్తోంది. వీటిల్లో వక్ఫ్ (సవరణ) బిల్లు, బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లు, రైల్వే (సవరణ) బిల్లు, విపత్తు నిర్వహణ (సవరణ) బిల్లుతోపాటు పలు బిల్లులను ప్రభుత్వం పెట్టనుంది. బడ్జెట్ ప్రజల్లో కొత్త విశ్వాసం నింపుతుందని భరోసా ఇచ్చారు. అలాగే పదేళ్ల కాలంలో పార్లమెంట్ సెషన్‌కు ముందు ఈసారే విదేశీ జోక్యం కనిపించలేదని విపక్షాలకు చురకలు అంటించారు.
'పేదలు, సామాన్యులపై మహాలక్ష్మి కృప ఎప్పటికీ ఉండాలి. భారత శక్తిసామర్థ్యాలు మనకు విశేష గుర్తింపును ఇస్తాయి. మూడోసారి ఎన్డీయేకు ప్రజలు పట్టం కట్టారు. మూడోసారి పార్లమెంట్‌లో సంపూర్ణ బ్జడెట్ ప్రవేశపెడుతున్నాం. ఈ వార్షిక పద్దు ప్రజల్లో కొత్త విశ్వాసం నింపుతుంది. భారత్ అభివృద్ధి లక్ష్యంతో మిషన్ మోడ్‌లో ముందుకెళ్తున్నాం. ఇన్నోవేషన్, ఇన్‌క్లూజన్, ఇన్వెస్ట్‌మెంట్ లక్ష్యంతో దూసుకెళ్తున్నాం. కొత్త విధానాల పైనే ఆర్థిక ప్రగతి ఆధారపడి ఉంటుంది. పార్లమెంటులో చరిత్రాత్మక బిల్లులు
ప్రవేశపెడుతున్నాం. పార్లమెంటు సమావేశాల్లో అన్ని అంశాలపై సమగ్ర చర్చ జరుగుతుందని, ఉభయ సభలు సజావుగా సాగేందుకు ప్రతిపక్షాలు సహకరిస్తాయని భావిస్తున్నాను' అని మోదీ ఆశాభావం వ్యక్తంచేశారు.

# ప్రపంచంలో మూడో ఆర్థికశక్తిగా భారత్

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. 'మహా కుంభమేళా జరుగుతున్న సమయంలో పార్లమెంట్ సమావేశాలు ప్రారంభించుకుంటున్నాం. ఇటీవల గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నాం' అని రాష్ట్రపతి హర్షం వ్యక్తంచేశారు. బడ్జెట్‌లో రైతులు, మహిళలు, పేదలు, యువతకు ప్రాధాన్యం ఉంటుందని ఆమె తెలిపారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే సర్కారు.. గత ప్రభుత్వాల పాలనతో పోలిస్తే మూడు రెట్లు వేగంతో పనిచేస్తోంది. త్వరలో ప్రపంచంలో మూడో ఆర్థికవ్యవస్థగా భారత్ మారనుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పేదరిక నిర్మూలన కోసం అనేక పథకాలు అమలుచేస్తున్నాం. 25 కోట్ల మందిని దారిద్ర్యం నుంచి బయటకు తీసుకొచ్చాం. అర్హులందరికీ లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలను వేగంగా అమలుచేస్తున్నాం అని అన్నారు. మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం. అదనంగా మూడు కోట్ల కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం కోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజనను పొడిగించాం అన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద.. 70 ఏళ్లు పైబడిన ఆరు కోట్ల మంది
వృద్ధులకు ఆరోగ్య బీమా అందిస్తోంది. అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు ప్రవేశపెడుతున్నాం. విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. యువతకు నూతన ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. నూతన విద్యా విధానంతో ఆధునిక విద్యా వ్యవస్థను ఏర్పాటుచేశాం. సంస్కరణలు వేగవంతం చేశాం. ఒకే దేశం-ఒకే ఎన్నిక, వక్ఫ్ సవరణ బిల్లు అమలు దిశగా సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నాం అని అన్నారు. దేశంలో కార్పొరేట్ సంస్థలకు మహిళలు నాయకత్వం వహిస్తున్నారు. ఒలింపిక్ పతకాలు సాధిస్తూ దేశం గర్వించేలా చేస్తున్నారు. వారి సాధికారకతకు కృషి చేస్తున్నాం. మారుమూల ప్రాంతాల్లో డిజిటల్ సేవల కల్పనలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు గొప్ప ముందడుగు. నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ కింద 91 లక్షలకు పైగా స్వయం సహాయక బృందాలకు సాధికారికత కల్పిస్తున్నాం. 3 కోట్ల మందిని లక్‌పతీ దీదీగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం అన్నారు. భారత్‌ను గ్లోబల్ ఇన్నోవేషన్ పవర్‌హౌస్‌గా మార్చడమే మా లక్ష్యం. నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను ప్రారంభించాం. కృత్రిమ మేధ రంగంలో 'భారత ఏఐ మిషన్'ను మొదలుపెట్టాం. భారత్ తన సొంత మానవ సహిత అంతరిక్ష ప్రయోగం గగన్‌యాన్‌ను ప్రయోగించే రోజు ఎంతో దూరంలో లేదు. ఎంఎస్ఎంఈలకు క్రెడిట్ గ్యారెంటీ పథకాలు, ఇ-కామర్స్ ఎగుమతి కేంద్రాలు దేశంలో అన్ని రంగాల్లో వ్యాపారాలను ప్రోత్సహిస్తున్నాయి. సైబర్ సెక్యూరిటీలో సమర్థత కోసం నిరంతరం కృషి చేస్తున్నాం. డిజిటల్ మోసాలు, సైబర్ నేరాలు, డీప్‌ఫేక్ వంటివి సామాజిక, ఆర్థిక, దేశ భద్రతకు పెను సవాళ్లుగా మారాయి. ప్రపంచ వేదికపై డిజిటల్ టెక్నాలజీలో భారత్ కీలకపాత్ర పోషిస్తోంది. మన యూపీఐ లావాదేవీల వ్యవస్థ విజయాన్ని అభివృద్ధి చెందిన దేశాలు కూడా ప్రశంసించాయి. భారత మెట్రో నెట్‌వర్క్ 1000 కిలోమీటర్ల మైలురాయిని దాటింది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్‌గా నిలిచింది.

ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం దేశవ్యాప్తంగా 1.75లక్షల ఆరోగ్య మందిర్‌లను ఏర్పాటుచేశాం. క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల కోసం వారు ఉపయోగించే పలు ఔషధాలపై కస్టమ్ సుంకాన్ని రద్దు చేశాం. గర్భిణులు, పిల్లల వ్యాక్సినేషన్ కోసం యు-విన్ పోర్టల్‌ను ప్రారంభించాం. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు సాగు ఉత్పత్తులకు గిట్టుబాటు ధర అందిస్తున్నాం. కచ్చితమైన వాతావరణ సమాచారాన్ని అందించేందుకు రూ.2000 కోట్లతో 'మిషన్ మౌసం'ను ప్రారంభించాం. సహకార రంగంలో అనేక ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం అని వివరించారు. ఆర్టికల్ 370 తర్వాత జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు మెరుగయ్యాయి. సంస్కరణలు, పనితీరు, పరివర్తన అనేవి ప్రభుత్వ పాలనకు బలమైన స్తంభాలుగా మారాయన్నారు. సరిహద్దుల రక్షణ, అంతర్గత భద్రత కోసం ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. వామపక్ష అతివాదానికి వ్యతిరేకంగా పోరాటం చివరిదశకు చేరింది. నక్సల్స్ ప్రభావిత జిల్లాల సంఖ్య 38కు తగ్గింది. రక్షణ రంగంలో స్వావలంబన దిశగా కీలక అడుగులు వేస్తున్నాం అని రాష్ట్రపతి అన్నారు. బడ్జెట్-2025లో రైతులు, మహిళలు, పేదలు, యువతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. రూ.70 వేల కోట్లతో గ్రామీణ రహదారులను అభివృద్ధి చేస్తున్నాం. దేశాభివృద్ధి ఫలాలు అందరికీ అందాలన్నదే మా లక్ష్యం. పేద, మధ్యతరగతి ప్రజలకు హోమ్ లోన్ సబ్సిడీ ఇస్తున్నాం. ఉద్యోగుల కోసం 8వ వేతన సంఘాన్ని నియమించాం. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చాం. వన్ నేషన్ ? వన్ ఎలక్షన్ దిశగా అడుగులు వేస్తున్నాం. ట్యాక్స్ విధానాలను సరళీకరించాం. భారత్ త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుంది. చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లతో గొప్ప ముందడుగు వేస్తున్నాం. 70 ఏళ్లు దాటిన 6 కోట్లమందికి ఆరోగ్య బీమా కల్పిస్తున్నాం. యువతకు ఉద్యోగాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాం. దేశంలో లక్షా 15 వేల మంది మహిళలు లక్‌పతీ దీదీలుగా మారారు. మూడు లక్షలమంది మహిళలను లక్‌పతీ దీదీగా మార్చాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం'



అని రాష్ట్రపతిముర్ము తన ప్రసంగంలో వివరించారు. రాజ్యాంగం ముందునాటి చట్టాలను సమీక్షిస్తున్నాం..ప్రస్తుత కాలానికి తగినట్లు ఆ చట్టాలను మారుస్తున్నాం. అటల్ టన్నెల్, సోన్‌మార్గ్ టన్నెల్ వంటివి నిర్మించాం. భారత మెట్రో నెట్‌వర్క్ 1000 కిలోమీటర్ల మైలురాయిని దాటింది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్‌గా నిలిచిందిభావితరాలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకుంటున్నాం. చ్చితమైన వాతావరణ సమాచారాన్ని అందించేందుకు రూ.2000 కోట్లతో మిషన్ మౌసంను ప్రారంభించాం అని వివరించారు. ఆమె ప్రసంగిస్తున్నంత సేపు ప్రధాని మోడీ సహా అధికారపక్ష సభ్యులు బల్లలు చరిచారు. అంతకుముందు రాష్ట్రపతి సంప్రదాయ పద్ధతిలో పార్లమెంట్‌కు చేరుకోగానే ఉప రాష్ట్రపతి ధన్‌కడ్, స్పీకర్ ఓంబిర్లాలు స్వాగతం పలికారు.

# నేడు ఢిల్లీకి వెళ్లనున్న సీఎం చంద్రబాబు



అమరావతి:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆయన ప్రచారం చేయనున్నారు. ఎన్డీయే పొత్తులో భాగంగా బీజేపీ తరఫున ప్రచారం చేయాలని టీడీపీ నిర్ణయించింది. ఈ మేరకు ఢిల్లీకి చంద్రబాబు రేపు వెళ్లనున్నారు. బీజేపీకి మద్దతుగా తెలుగువారున్న ప్రాంతాల్లో ఆయన ప్రచారం చేయనున్నారు. దీనికి సంబంధించి నేడు ఢిల్లీలో ఆంధ్ర అసోసియేషన్‌తో టీడీపీ ఎంపీలు సమావేశం కానున్నారు. ఆదివారం రోజు ఎంపీలతో కలిసి బీజేపీ తరఫున చంద్రబాబు ప్రచారం చేయనున్నారు. కాగా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. కాంగ్రెస్, బీజేపీ, ఆప్ పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ప్రతి పార్టీ తమ అగ్రనాయకులను రంగంలోకి దింపుతూ ప్రజలను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఎన్నికలకు మరి కొన్ని రోజులు మాత్రమే ఉండడంతో జోరుగా ప్రచారం సాగుతోంది. పోటాపోటీలు ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలు ప్రకటిస్తూ ఓటర్లను తమవైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నాయి. మరోవైపు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల విషయంలో ముఖ్య నేతలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఉభయ గోదావరి జిల్లాలు, ఉమ్మడి కృష్ణా- గుంటూరు జిల్లాల నేతలతో నేడు ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరాబత్తుల రాజశేఖర్, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను కూటమి అభ్యర్థులుగా బలపరిచామని తెలిపారు. ఫిభ్రవరి 27న జరిగే ఎన్నికల్లో వారిని భారీ మెజార్టీతో గెలిపించేలా చూడాలని ఆదేశించారు.

# నీళ్ల మీద సిఎం "నీచ రాజకీయం".

ఆదిత్యానాథ్ దాస్ ను ఇరిగేషన్ సలహాదారు పదవి నుంచి తొలగించాలని, కృష్ణ ట్రైబ్యునల్ లో రాష్ట్రం తరఫున బలంగా వాదనలు వినిపించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ నాయకత్వంలో అవిశ్రాంతంగా పని చేస్తేనే కోటి ఎకరాల మాగాణంగా మారిందని, ఎంతో మంది మేధావుల, ఇంజనీర్ల కృషి ఫలతమే అనేక ప్రాజెక్టుల నిర్మాణమని తెలిపారు. తెలంగాణ సమగ్రాభివృద్ధిలో నీటి వనరులు ఒక ప్రధాన అంశంగా పెట్టుకొని ముందుకెళ్లామని, కానీ ఈ ప్రభుత్వం జలవనరుల రంగాన్ని విర్మిస్తున్నదని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో 60 ఏళ్లలో కేవలం 50 లక్షల ఎకరాలకు నీళ్లందించారని, కానీ తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేళ్లలో కోటి ఎకరాలకుపైగా నీళ్లందించామని, కాలంతో పోటీ పడి ప్రపంచంలోనే అత్యద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ నిర్మించారని వివరించారు. మొత్తం కోటి 24 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా బిఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టులను పూర్తి చేశామని పేర్కొన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులను బాగు చేసుకొని 15 లక్షల ఎకరాలకు నీళ్లించుకోవడం జరిగిందని, కేవలం చెరువులను బాగు చేసుకోవడం వల్ల 9.6 టీఎంసీల నీటిని ఒడిసి పట్టుకున్నామని అన్నారు. అందుకు సాక్ష్యం తెలంగాణ ఏర్పడే సమయానికి 68 లక్షల టన్నుల వరి పండితే... 2022-23 నాటికి కోటి 68 లక్షల టన్నుల ధాన్యం పండిందని, వరి పండించే రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానానికి ఎదిగిందని స్పష్టం చేశారు. ఇన్ని చేసినా పదేళ్లలో ఏమి జరగలేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. గతంలో కాంగ్రెస్, టీడీపీ పార్టీలు పరిపాలించి ప్రాజెక్టుల్లో పల్లేర్లు మొలిపించాయని, కాంగ్రెస్ నాయకులు పదవుల కోసం పైరవీలు చేసుకున్నారు తప్ప ప్రాజెక్టుల కోసం కొట్లాడలేదని మండిపడ్డారు. గట్టిగా జై తెలంగాణ అంటే... వెంటనే ఫేక్ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేసేవారని గుర్తు చేశారు. "వైఎస్ఆర్ పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు ద్వారా రాయలసీమ ప్రాంతానికి మన జలాలను తరలించారు. అదే ఒరవడిని జగన్, చంద్రబాబు కొనసాగించారు. అందులో భాగంగానే ఏపీ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల, పోలవరం- బనకచర్ల ప్రాజెక్టులను చేపడుతున్నాయి. ఇన్నాళ్లు కాంగ్రెస్, టీడీపీలే అన్యాయం చేశాయనుకుంటే... ఇప్పుడు వాటికి బీజేపీ తోడయ్యింది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్ద కేంద్ర బలగాలను మోహరింపజేశారు. కృష్ణా జలాల దోపిడీని ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్ఎస్, జగన్ కొనసాగించారు. ఇప్పుడు గోదావరి నదిపై కూడా ఆంధ్రా నాయకుల కన్ను పడింది.



రాష్ట్రంలో తెలంగాణ సోయితో పరిపాలనం జరగడం లేదు." అని వ్యాఖ్యానించారు. కేసులు వేసి ప్రాజెక్టులను అడ్డుకున్న నీచమైన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని ధ్వజమెత్తారు. జలవనరుల విషయాల్లో ఇతర రాష్ట్రాల్లో పార్టీలకు అతీతంగా ఒక్కటవుతారని, కానీ తెలంగాణ మాత్రం కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రాజకీయం చేస్తున్నాయని ఎండగట్టారు. కేసీఆర్ నిర్మించిన ప్రాజెక్టులు పనికిరావని దుష్ప్రచారం చేస్తున్నారని, నీళ్లు ఇవ్వక రైతుల పొట్టకొడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా, ఇరిగేషన్ శాఖ మంత్రి సొంత జిల్లాలో పంటను ఎండగొట్టారని ఉదాహరించారు. బీఆర్ఎస్ హయాంలోనే సీతారామ ఎత్తిపోతల పథకం పనులు దాదాపు పూర్తయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని ఆర్భాటంగా ప్రారంభించినా ఆ ప్రాజెక్టు ద్వారా చుక్క నీరు కూడా ఇవ్వలేదని చెప్పారు. రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ వీ ప్రకాశ్, సాగునీటి శాఖ మాజీ ఓఎస్డీ, విశ్రాంత ఇంజనీర్ శ్రీధర్ రావు దేశ్ పాండే, బీఆర్ఎస్ నాయకుడు పల్లె రవి కుమార్ గౌడ్, రిటైర్డ్ సీఈ ఖగేందర్, తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్స్ ఫోరం మాజీ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, తెలంగాణ ఇంజనీర్స్ జేఏసీ కార్యదర్శి వెంకటేశం, అంతర్ రాష్ట్ర వ్యవహారాల మాజీ ప్రభుత్వ సలహాదారు టంకశాల అశోక్, ఫ్లోరోసిస్ విమోచన సమితి నాయకులు కంచుకట్ల శ్రీనివాస్, తెలంగాణ గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, టీఎస్పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ దేవి ప్రసాద్, సీనియర్ జర్నలిస్టు కామెర నవీన్ కుమార్, బీసీ సంఘం నాయకుడు బొళ్ల శివశంకర్ , ఏల్చల దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంటు ముందుకు ఆర్థిక సర్వే

**న్యూఢిల్లీ:** 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ..దేశ జీడీపీ 6.3-6.8శాతంగా ఉండొచ్చని, ప్రైవేటు రంగ వినియోగం స్థిరంగా ఉంటుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. వచ్చే ఏడాది ఆర్థిక పరిస్థితులు మందకొడిగా ఉంటాయని అంచనా వేసింది. ఆర్థిక సర్వే ప్రకారం, 2024-25లో దేశీయ ఆర్థిక వ్యవస్థ మందకొడిగా కొనసాగే అవకాశం ఉంది. తయారీ రంగం బలహీనపడటం, కార్పొరేట్ పెట్టుబడులు తగ్గడం వృద్ధి రేటును ప్రభావితం చేస్తోంది. 2024ఆర్థిక సంవత్సరంలో భారతదేశ జిడిపి 8.2శాతంగా ఉంటే, కొత్త ఆర్థిక సంవత్సరంలో ఇది 6.4శాతం స్థాయికి తగ్గొచ్చని అంచనా వేసింది. రబీ పంట దిగుబడి బాగుంటే.. 2026 తొలి అర్ధభాగంలో ఆహార పదార్థాల ధరలు తగ్గే అవకాశం ఉంటుందని అంటున్నారు. ఖరీఫ్ పంట రావడంతో ఆహార పదార్థాల ధరలు తగ్గాయి. దీంతో 2024-25 నాలుగో త్రైమాసికంలో ఆహార ద్రవ్యోల్బణం తగ్గొచ్చని భావిస్తున్నారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా 2024-25 ఆర్థిక సర్వేను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగం పూర్తయిన తర్వాత ఆమె ఆర్థిక సర్వేను సభ ముందు ఉంచారు. అనంతరం స్పీకర్ ఓం బిర్లా సభను శనివారానికి వాయిదా వేశారు. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌ను నిర్మలమ్మ సభకు సమర్పించనున్నారు. కేంద్ర బడ్జెట్ సమర్పణకు ముందు ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. గత సంవత్సర కాలంలో దేశ ఆర్థిక పనితీరును.. రాబోయే సంవత్సరంలో ఆర్థికంగా ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి చెప్పేదే ఈ ఎకనామిక్ సర్వే. ఆర్థిక మంత్రిత్వశాఖకు చెందిన ఎకనామిక్ అఫ్లె÷ర్స్ డిపార్ట్‌మెంట్‌లోని ఎకనామిక్ డివిజన్ ఈ సర్వేను రూపొందిస్తుంది. తొలుత 1950-51 సంవత్సరం నుంచి ఆర్థిక సర్వేను బడ్జెట్‌తో పాటే ప్రవేశపెట్టేవారు. 1960 తర్వాత బడ్జెట్‌కు ఒకరోజు ముందు ప్రవేశపెట్టే సంప్రదాయం మొదలైంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణ భయాలు కాస్త తగ్గుముఖం పట్టొచ్చు. అయితే, భౌగోళిక రాజకీయ అనిశ్చితుల రూపంలో ఇంకా ముప్పు పొంచే ఉంది. ప్రభుత్వ మూలధనం పెరగడం, వ్యాపార అంచనాలు మెరుగుపడటంతో పెట్టుబడులు పుంజుకుంటాయని అంచనా వేస్తున్నారు. దేశీయంగా నెలకొన్న వాతావరణ పరిస్థితులు, అంతర్జాతీయంగా బలహీన డిమాండ్ నేపథ్యంలో గతేడాది తయారీ రంగం ఒత్తిడికి గురైంది. తయారీ రంగం నెమ్మదించడం, కార్పొరేట్ పెట్టుబడులు తగ్గడంతో 2024-25లో భారత వృద్ధి రేటు 6.4శాతానికి పరిమితం కావొచ్చు. గత నాలుగేళ్లలో ఇదే అత్యల్పం. 2023-24లో వృద్ధి రేటు 8.2శాతంగా ఉండగా.. 2022-23లో 7.2శాతం, 2021-22లో 8.7శాతంగా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో దేశంలో ఐపీఓ లిస్టింగ్‌లు గణనీయంగా నమోదయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా ఐపీఓ లిస్టింగ్‌ల్లో మన వాటా 30శాతంగా ఉంది. 2023తో పోలిస్తే ఇది 17శాతం ఎక్కువ. గత ఐదేళ్లలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దీని వల్ల భారీ మౌలికవసతుల రంగాల్లో కేంద్ర మూలధన వ్యయం 2020 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 38.8శాతం పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 5853 కిలోమీటర్ల జాతీయ రహదారులను నిర్మాణం పూర్తి చేశారు. జల్ జీవన్ మిషన్ కింద ఇప్పటివరకు 12 కోట్లకు పైగా
కుటుంబాలకు కొళాయిల ద్వారా తాగు నీరు సదుపాయం లభించింది. 2023-24లో నమోదైన 8.2శాతం వృద్ధి రేటితో పోలిస్తే గణనీయంగా తక్కువని చెప్పొచ్చు. ఆర్థిక సర్వే ప్రకారం, దేశీయ ఆర్థిక వ్యవస్థకు కొన్ని బలమైన అంశాలు కూడా ఉన్నాయి. బలమైన బాహ్య ఖాతాలు, సమతుల్య ఆర్థిక ఏకీకరణ, స్థిరమైన ప్రైవేట్ వినియోగం భారత ఆర్థిక వ్యవస్థను నిలబెడతాయని పేర్కొంది. ఆర్థిక సర్వేలో కీలక అంశాలు గమనిస్తే.. తయారీ రంగం బలహీనత, పెట్టుబడుల తగ్గుదల ప్రధాన ప్రతికూలతలుగా మారనున్నాయి. బలమైన బాహ్య ఖాతాలు, స్థిరమైన ప్రైవేట్ వినియోగం వృద్ధికి సహాయపడతాయి. ఇది ప్రస్తుతం దేశ ఆర్థిక పరిస్థితిని, ఎదురవుతున్న సవాళ్లను విశ్లేషిస్తుంది. అలాగే, సంస్కరణలు, అభివృద్ధికి సంబంధించిన మార్గదర్శకాలను అందిస్తుంది. కేంద్ర బ్జడెట్‌ను శనివారం ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టనున్నారు. పెట్టుబడి దారులు, వ్యాపార వర్గాలు, ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి!

వేగుచుక్క



# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మరో గుడ్‌న్యూస్..

ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులకు తీపి కబురు. ఇండ్లు కట్టుకునే లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక సరఫరా చేయనుంది. ఈ మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. పేదలపై భారం తగ్గించేందుకు గాను ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇసుక సరఫరా కోసం ప్రత్యేకంగా అధికారులతో కమిటీ కూడా ఏర్పాటు చేశారు.

తెలంగాణలో ఇండ్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని రేవంత్ సర్కార్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. తొలి విడతలో ఇండ్లులేని నిరుపేదలకు ఇండ్లు ఇస్తామన్నారు. ఖాళీ జాగా ఉన్నవారికి ఇండ్ల కేటాయింపు ఉంటుందని చెప్పారు. నియోజకవర్గానికి 3,500 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇండ్ల నిర్మాణానికి సిద్ధమయ్యారు. జనవరి 26న రిపబ్లిక్ డే రోజున ఈ పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. మండలానికి ఒక గ్రామం చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 563 గ్రామాల్లో 72 వేల మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేస్తూ పత్రాలు అందజేశారు. మార్చి 31 నాటికి మిగతా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని రేవంత్ సర్కార్ డిసైడ్ అయింది. పేదల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం అందిస్తుండగా.. ఖర్చును తగ్గించేందుకు గాను ఇసుకను ఉచితంగా ఇవ్వాలని డిసైడ్ అయింది. ఈ నేపథ్యంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఉచిత ఇసుక సరఫరాపై సర్కార్ దృష్టి పెట్టింది. ఈ మేరకు నలుగురు ఉన్నతాధికారులతో కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఇసుక సరఫరాకు ఎటువంటి కొరత రానివ్వకుండా ఏం చేస్తే బాగుంటుందో సూచించడానికి ఈ కమిటీ అడ్వైజ్ ఇవ్వనుంది. ఇందిరమ్మ ఇండ్లకు ఇసుకను స్థానిక వాగుల నుంచి అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. తద్వారా ఖర్చు తక్కువ ఉంటుందని అంచనా వేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పక్క జిల్లాల నుంచి తరలించాల్సిన పరిస్థితి ఉండగా.. అది ఖర్చుతో కూడుకున్న పని. దీంతో ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపైనా అధికారుల కమిటీ అధ్యయనం చేయనుంది.

ఇండ్ల నిర్మాణాలకు ప్రధానంగా ఇసుక అవసరం. ప్రస్తుతం మార్కెట్‌లో ఇసుకకు భారీ డిమాండ్ ఉంది. పేదలు డబ్బులు చెల్లించి కొనలేని పరిస్థితి ఏర్పడింది. మన ఇసుక-మన వాహనం స్కీం ద్వారా ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేస్తే ఎప్పుడొస్తుందో చెప్పలేని పరిస్థితి. ఇలాంటి సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగా ఇసక సరఫరా చేయాలని భావిస్తోంది. ముందుగా.. ఇటీవల ఇండ్ల మంజూరు పత్రాలు అందుకున్న 72 వేల మందికి ఇసుకను సరఫరా చేయనున్నారు.

## పట్నంలో బతకటం కష్టమే.. దేశంలో తెలంగాణనే టాప్

గ్రామీణ ప్రాంతాల్లోనూ ఖర్చులు పెరిగిపోతున్నాయి. తాజాగా.. కుటుంబ వినియోగ వ్యయం 2023-24 సర్వేలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పట్టణ వ్యయంలో దేశంలోనే తెలంగాణ టాప్ ప్లేస్‌లో ఉంది. పట్నంలో బతకం ఇక కష్టమే. నెలకు ఓ పాతిక వేలు ఆదాయం వచ్చే వారు మాత్రమే అంతంత మాత్రంగా కుటుంబాన్ని నెట్టుకురాగలరు. రూ.20 వేలకు తక్కువ సంపాదిస్తే మాత్రం పట్టణాల్లో జీవనం సాగించటం కష్టమైన పనే అని చొప్పొచ్చు. ఇంటి అద్దెలు, పిల్లల స్కూలు ఫీజులు, నిత్యవసర వస్తువుల కొనుగోలు ఇలా అన్ని వ్యయాలు భారీగా పెరుగుతున్నాయి. తాజాగా.. కుటుంబ వినియోగ వ్యయం సర్వే 2023-24 వెల్లడించిన ఫలితాల్లో కీలక అంశాలు వెలుగు చూశాయి. రాష్ట్రంలో గతేడాదితో పోలిస్తే.. తలసరి నెలవారీ వినియోగ వ్యయం పెరిగింది. గ్రామాల్లో రూ.633, పట్టణాల్లో రూ.820 పెరిగిందని సర్వే ఫలితాలు వెల్లడించాయి.

తలసరి నెలవారీ ఖర్చు గ్రామాల్లో రూ.5,435 ఉంటే.. పట్టణాల్లో రూ.8,978కి పెరిగింది. దేశవ్యాప్తంగా చూసుకున్నట్లయితే పట్టణ తలసరి సగటు వినియోగ వ్యయంలో తెలంగాణనే టాప్‌లో ఉంది. దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో తలసరి నెలవారీ వ్యయం రూ.4,122 కాగా.. పట్టణాల్లో రూ.6,199గా ఉంది. గ్రామీణం ప్రాంతాల్లో కేరళ తలసరి సగటు ఖర్చు రూ.6,611తో అగ్రస్థానంలో ఉంది. ఆదాయ వర్గాల వారీగా చూసినట్లయితే.. తెలంగాణలో గరిష్ఠంగా నెలకు రూ.12,619 ఖర్చవుతున్నట్లు సర్వేలో తేలింది.

దేశవ్యాప్తంగా చూసినట్లయితే.. మొత్తం ఖర్చులో ఆహార కోసం చేసే వ్యయం గ్రామీణ ప్రాంతాల్లో 47 శాతంగా ఉంది. ఇందులో వివిధ రకాల పానీయాలు, ప్రాసెస్డ్ ఫుడ్ కోసం 9.84 శాతం ఖర్చు చేస్తున్నారు. ఇతరాల్లో రవాణా కోసం 7.59 శాతం, వైద్యం కోసం 6.83 శాతం, దుస్తులు, చెప్పుల కోసం 6.63 శాతం ఖర్చు చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో చూసుకున్నట్లయితే.. మొత్తం ఆహార వ్యయం 40 శాతంగా ఉంది. ఇందులో పానీయాలు, ప్రాసెస్డ్ ఫుడ్ కోసం 11.09 శాతం ఖర్చు చేస్తున్నారు. రవాణా కోసం 8.46 శాతం, వస్తువులు, వినోదం కోసం 6.92 శాతం, డ్యూరబుల్ గూడ్స్ కోసం 6.87 శాతం, ఇంటి అద్దెల కోసం 6.58 శాతం వెచ్చిస్తున్నారు.

తెలంగాణలో విద్యపై గ్రామాల్లో నెలకు తలసరి వ్యయం రూ.183 కాగా.. పట్టణాల్లో రూ.713.89 ఖర్చు చేస్తున్నట్లు తేలింది. దేశవ్యాప్తంగా చూసినట్లయితే.. పట్టణాల్లో చదువుల కోసం అత్యధిక వ్యయం తెలంగాణలోనే ఖర్చు చేస్తున్నట్లు నివేదికలో వెల్లడైంది. పట్టణాల్లో జీవించే ప్రజలు ఇంటి అద్దెకు పది శాతం ఖర్చుచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం కోసం నెలకు రూ.376 ఖర్చు చేస్తే.. పట్టణ ప్రాంతాల్లో నెలకు రూ.426 ఖర్చు చేస్తున్నట్లు సర్వేలో తేలింది. సామాజికవర్గాల వారీగా చూస్తే ఈ వ్యయంలో ఎస్టీ, ఓబీసీల వ్యయం తక్కువగా ఉన్నట్లు తేలింది.

మద్యం, పాన్, పొగాకు తదితర ఉత్పత్తుల కోసం గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువగా ఖర్చు చేస్తున్నారు. గ్రామాల్లో నెలకు రూ.396 ఖర్చు చేస్తే.. పట్టణాల్లో రూ.320 ఖర్చుచేస్తున్నట్లు తేలింది. ఆహార ఖర్చులో.. పానీయాలు, ప్రాసెస్డ్‌ఫుడ్ కోసం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు 20.84 శాతం, పట్టణాల్లో 33.63 శాతం ఖర్చు చేస్తున్నట్లు సర్వే ఫలితాల్లో వెల్లడైంది.

# రాజ్యాంగ పరిరక్షణ కోసం ఉద్యమించాలి.

**-బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్.**

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, జనవరి 31:**

రాజ్యాంగ పరిరక్షణ ద్వారానే తెలంగాణలో బహుజన రాజ్యాధికారం సకల జనుల సమస్యలకు పరిష్కారం చూపుతుందని బహుజన లెఫ్ట్ పార్టీ(బహుజన కమ్యూనిస్టు) రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని ధ్వంసం చేసి చరిత్రను వక్రీకరించి తెలంగాణలో అధికారంలోకి రావడానికి బిజెపి చేస్తున్న విద్వేష మతోన్మాద రాజకీయాలను తెలంగాణ ప్రజలు ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని షోయబ్ హాల్ లో శుక్రవారం బహుజన లెఫ్ట్ పార్టి వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి బి. కృష్ణ స్వామి 4వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా దండి వెంకట్ మాట్లాడుతూ, మార్క్సిజం, అంబేద్కరిజం ఆలోచన విధానంతో తెలంగాణలో బహుజన రాజ్యాధికారం లక్ష్యంగా, బహుజన లెఫ్ట్ పార్టీ బహుజన శ్రామిక వర్గ కులాల నాయకత్వంలో ఏర్పడిందని అన్నారు. దేశంలో కాంగ్రెస్, బిజెపి ఆధిపత్య వర్గాల నాయకత్వంలో ప్రాంతీయంగా శూద్ర అగ్రకులాలైన రెడ్డి, కమ్మ , వెలమ తదితర ఆధిపత్య కులాల యాజమాన్యంలోని



రాజకీయ పార్టీల కనుసన్నలలో ఏర్పడే ప్రభుత్వాలతో బహుజన శ్రామిక వర్గ ప్రజలకు సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి, స్వేచ్ఛా, సమానత్వం ఇంకా వెయ్యి సంవత్సరాలైనా జరగదన్నారు. జస్టిస్ చంద్ర కుమార్ మాట్లాడుతూ, తెలంగాణలో నూటికి తొంభై ఏడు శాతం ఉన్న బహుజనులు రాజ్యాధికారంలోకి రాకుండా కుట్ర చేస్తున్న బిజెపి మనుధర్మ మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్, బహుజన పొలిటికల్ సెంటర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కన్వీనర్ సాదు మాల్యాద్రి, బిఎల్ పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. సిద్ది రాములు, బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత, బిఎల్ పి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ. శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# అలా చేస్తే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు..



వాహనదారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర హెచ్చరికలు చేశారు. ట్రాఫిక్ రూల్స్ పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని.. వారి డ్రైవింగ్ లైసెన్స్‌లను రద్దు చేస్తామని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించాలని మంత్రి సూచించారు. రోడ్డు భద్రతా మహోత్సవాలు ముగింపు సందర్భంగా నిర్వహించిన వాకథాన్‌లో పాల్గొన్న మంత్రి పొన్నం.. రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ గురించి మాట్లాడారు.

రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతీ ఒక్క వాహనదారుడు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు పలికారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. రోడ్డు భద్రత మన అందరి బాధ్యత అని ఈ సందర్భంగా మంత్రి పొన్నం తెలిపారు. రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించిన వాకథాన్ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. హెచ్‌ఎండీఏ గ్రౌండ్ నుంచి ఎన్టీఆర్ మార్గ్ వరకు ఈ వాకథాన్ నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం.. జెండా ఊపి వాకథాన్‌ను ప్రారంభించారు. రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్‌పై ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఈ వాకథాన్‌లో రవాణా శాఖ అధికారులు, విద్యార్థులు భారీగా పాల్గొన్నారు. స్కూళ్లలో రహదారి భద్రతను ఒక పాఠ్యాంశంగా తీసుకోవడం జరుగుతుందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ రోడ్డుపై ప్రయాణించేటపుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను రక్షించాలని మంత్రి పొన్నం పేర్కొన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే కఠిన చర్యలు ఉంటాయని.. డ్రైవింగ్ లైసెన్స్ కూడా రద్దు చేస్తామని తీవ్ర హెచ్చరికలు చేశారు. జాతీయ రోడ్డు భద్రతా మహోత్సవాలను తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోందని మంత్రి తెలిపారు. ట్రాఫిక్ రూల్స్‌ని పాటించాలని.. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ క్రమంలోనే జాతీయ రోడ్డు భద్రతా మహోత్సవాలు జనవరి 1వ తేదీ నుంచి జనవరి 31వ తేదీ వరకు జరిగాయి.

రోడ్డు భద్రతపై అందరికీ అవగాహన చాలా అవసరమని.. దాని వల్ల మనం ఒక్కరిని కాపాడినా చాలా సంతోషమని తెలిపారు. బ్లాక్ స్పాట్స్ ఉన్న వాటిని గుర్తించి వాటిని పూడ్చే ప్రయత్నం మొదలైందని వివరించారు. రవాణా శాఖ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని అనుకున్నామ మంత్రి తెలిపారు. వేగం థ్రిల్ ఇస్తుంది కానీ దాన్ని చంపుతుందని చెప్పారు.



# పదవీ విరమణ వయసు 65 ఏళ్లకు పెంపు..

తెలంగాణలోని 12 యూనివర్సిటీల్లోని ప్రొఫెసర్లకు రేవంత్ సర్కార్ తీపి కబురు చెప్పింది. వారి పదవీ విరమణ వయస్సను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం 60 ఏళ్లుగా ఉన్న రిటైర్మెంట్ ఏజ్‌ను 65 ఏళ్లకు పెంచింది. ఈ మేరకు గురవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. నేడు ఐదుగురు ప్రొఫెసర్లు రిటైర్మెంట్ కావాల్సి ఉంటగా.. ప్రభుత్వ నిర్ణయంతో వారు మరో ఐదేళ్ల పాటు భోదనా వృత్తిలో కొనసాగనున్నారు.

తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఉన్నత విద్యాశాఖ పరిధిలోని 12 విశ్వవిద్యాలయాల్లోని ఆచార్యులకు గుడ్‌న్యూస్ చెప్పింది. వారి పదవీ విరమణ వయసును పెంచింది. ప్రస్తుతం రిటైర్‌మెంట్ ఏజ్ 60 నుంచి 65కి పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గురువారం (జనవరి 30)న విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా జీవో జారీ చేశారు. జనవరి 26న రిపబ్లిక్ డే సందర్భంగా అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్ ప్రొఫెసర్ల పదవీ విరమణ వయస్సును 60 ఏళ్ల నుంచి 65కు పెంచాలన్న యోచన ఉందని చెప్పారు.

అంతకు ముందే.. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రభుత్వానికి ప్రతిపాదన పంపినట్లు తెలిసింది. ఈ మేరకు సీఎం రేవంత్ ఇటీవల పదవీ విరమణ వయస్సుపై ప్రకటన చేశారు. తాజాగా.. వారి పదవీ విరమణ వయస్సును 60 నుంచి 65 ఏళ్లకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, తెలంగాణ సహా మూడు రాష్ట్రాల్లో వర్సిటీ ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసు 60 ఏళ్లుగా ఉంది. ఇక విశ్వవిద్యాలయాల్లో పనిచేసే బోధనేతర సిబ్బంది రిటైర్‌మెంట్ వయసును మాత్రం గత బీఆర్ఎస్ ప్రభుత్వం 58 నుంచి 61 ఏళ్లకు పెంచింది. మెడికల్ కాలేజీల్లో ప్రొఫెసర్ల వయస్సును కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం 65 ఏళ్లకు పెంచింది. రాష్ట్ర వర్సిటీల్లో మాత్రం 60 ఏళ్లుగానే ఉంది.

అయితే ప్రతి ఏడాది ప్రొఫెసర్ల ఖాళీలు భారీగా పెరుగుతుండటంతో పాటుగా.. న్యాక్ గ్రేడ్, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ర్యాంకింగ్‌లో వర్సిటీలు వెనకబడే పరిస్థితి ఉంది. దీంతో ప్రొఫెసర్ల పదవీ విరమణ వయస్సు పెంచాలనే డిమాండ్ గత పదేళ్లుగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా సీఎం రేవంత్ ప్రభుత్వం వారి రిటైర్మెంట్ ఏజ్‌ను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల విశ్వవిద్యాలయాల్లోని ప్రొఫెసర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 12 విశ్వవిద్యాలయాల్లో నేడు (జనవరి 31) ఐదుగురు ప్రొఫెసర్లు పదవీ విరమణ పొందాల్సి ఉంది. అయితే రిటైర్‌మెంట్ ఏజ్ పెంచుతూ తాజా ఉత్తర్వులతో వారు మరో ఐదేళ్ల పాటు బోధనా వృత్తిలో కొనసాగనున్నారు. వర్సిటీల్లో మొత్తం ప్రొఫెసర్ల మంజూరు పోస్టులు 2,878 కాగా ప్రస్తుతం 2,125 ఖాళీలు ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

# 18 మంది హైకోర్టు జడ్జిలపై నిఘా..

తెలంగాణ ఫోన ట్యాపింగ్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతలు, వ్యాపార ప్రముఖలతో పాటుగా న్యాయమూర్తుల పైనా నిఘా ఉంచినట్లు తేలింది. ఈ మేరకు తాజాగా.. ఎఫ్ఎస్ఎల్ నివేదిక రాగా అందులో కీలక అంశాలు వెలుగు చూశాయి. మ్నొత్తం 18 హైకోర్డు జడ్జిలపై నిఘా పెట్టినట్లు గుర్తించారు. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసు సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతలతో పాటుగా.. పలువురు ప్రముఖులు, వ్యాపారుల ఫోన్లు ట్యాప్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు తెలంగాణ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(%వా×దీ%) మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు సహా, పలువురు పోలీసు ఉన్నతాధికారులపై కేసులు నమోదయ్యాయి. ఫోన్ల అక్రమ ట్యాపింగ్ కేసులో విచారణ కొనసాగుతుండగా.. విచారణలో విస్తుపోయే అంశాలు వెలుగులోకి వస్తున్నాయి.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ సమయంలో తెలంగాణ హైకోర్టులో పని చేస్తున్న 18 మంది జడ్జిలపైనా నిఘా పెట్టినట్లు తేలింది. న్యాయమూర్తుల వివరాలు ఈ కేసుకు సంబంధించిన ఓ నిందితుడి కంప్యూటర్‌లో ఉన్నాయని పోలీసులు తెలిపారు. అందులో ఐదుగురు మహిళా జడ్జిల సమాచారం కూడా ఉందని వెల్లడించారు. ఈ కేసులో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, వారు అధికారికంగా వినియోగిస్తున్న కంప్యూటర్లను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ కు పంపించారు. కేసులో మూడో నిందితుడిగా ఉన్న భుజంగరావు కంప్యూటర్ హార్డ్ డిస్క్‌కు సంబంధించి తాజాగా.. పోలీసుల చేతికి ఎఫ్ఎస్ఎల్ నివేదిక అందింది. ఆ హార్డ్ డిస్క్‌లో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన కీలక నేతలు, ఎమ్మెల్యేగా పోటీ చేయబోతున్న అభ్యర్థులు, పలువురు జడ్జిల ప్రొఫైళ్లు బహిర్గతమయ్యాయి. ఈ మధ్య కాలంలోనే రిటైర్ అయిన ముగ్గురి జడ్జిల ప్రొఫైళ్లతో సహా మొత్తం 18 మంది జడ్జిల వివరాలు భుజంగరావు కంప్యూటర్‌లో లభ్యమయ్యాయి. తెలంగాణ హైకోర్టు నుంచి ఇతర హైకోర్టులకు బదిలీ అయిన మరో ముగ్గురి జడ్జిల వివరాలు కూడా గుర్తించారు. హైకోర్టు జడ్జిలపైనే కాకుండా.. నాంపల్లి ఏసీబీ కోర్టుల్లోని ఓ కీలక జడ్జి ప్రొఫైల్ కూడా ఆ కంప్యూటర్‌లో లభించింది. ఈ ప్రొఫైళ్లలో జడ్జిల ఫొటోలు,



వారి స్వస్థలం, చదువు, ఉద్యోగప్రస్థానం, కుటుంబసభ్యుల వివరాలు ఇలా అన్నింటిని పొందుపరిచారు. అయితే ఎఫ్ఎస్ఎల్ నివేదికలోని పూర్తి వివరాలు బయటకు వస్తే మరిన్ని సంచలన విషయాలు వెలుగుచూసే ఛాన్స్ ఉందని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావుతోపాటు మరో కీలక నిందితుడు శ్రవణ్‌రావును ప్రొక్లెయిమ్డ్ అఫెండర్ నిర్ధారించే దిశగా పోలీసులు కసరత్తు చేపట్టారు. ఇప్పటికే అరెస్ట్ అయి రిమాండ్‌లో ఉన్న మాజీ అదనపు ఎస్పీ భుజంగరావు, మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావులకు హైకోర్టు గురువారం (జనవరి 30) షరతులతో బెయిలు మంజూరు చేసింది.

# పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

గంభీరావుపేట మండలం గోరంటాల వద్ద అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ప్రయాణికులకు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వివరాల్లోకి వెళితే.. కామారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కామారెడ్డి నుంచి సిరిసిల్ల వైపు బయల్దేరింది. బస్సులో సుమారు 50 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. గంబీరావుపేట మండలం గోరంటాల బ్రిడ్జి వద్దకు రాగానే.. మూల మలుపు వద్ద బస్సు వెనుక టైర్ పేలిపోయింది. దీంతో అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అనంతరం 108 అంబులెన్స్‌లో సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.. సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. క్షతగాత్రులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని సూచించారు. కాగా, ప్రమాద ఘటనపై ఆరా తీశారు. రోడ్డు ప్రమాదంలో ప్రాణపాయం తప్పటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రోడ్డు పక్కనే చెట్టు కానీ.. లోయ వంటి ప్రాంతం గానీ ఉండి ఉంటే ప్రమాద తీవ్రత



పెరిగి ఉండేదని ప్రయాణికులు చెప్పారు. పంట పొలం కావటంతో.. బస్సు బురదలో కూరుకుపోయి ప్రమాదం తప్పిందని అంటున్నారు. ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో మహిళ మృతి ఖమ్మం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. మరో 20మందికి తీవ్ర గాయాలయ్యాయి. బోనకల్లు సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బోనకల్లు నుంచి ఎన్టీఆర్ జిల్లా వత్సవాయిలో మిర్చి కోసేందుకు కూలీలు ట్రాక్టర్‌లో బయల్దేరారు. అయితే బోనకల్లు వద్దకు చేరుకోగానే.. ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గోయిలో పడిండి. ఈ ప్రమాదం లో యార్లగడ్డ వరమ్మ అనే మహిళ మృతి చెందింది. మరో 20 మంది కూలీల తీవ్రంగా గాయపడ్డారు. అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. క్షతగాత్రులను వెంటనే ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి చికిత్స అందిస్తున్నారు.

